జులై '94 'బొమ్మకి కథ' పోటీలో ఎన్నికైన కథ



# పుట్టింటి గౌరవం

అన్నపూర్ణమ్మకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. పిల్లలు చిన్నతనంలోనే భర్త కన్నుమూశాక పిల్లల ఆలనా, పాలనా అంతా అన్నపూర్ణమ్మ పైనే పడింది. టైలరింగ్ పనిచేస్తూ, కష్టపడి పిల్లలకు చదువు చెప్పించింది. ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నా సరిపెట్టుకుని పొదుపుగా సంసారాన్ని నెట్టుకొస్తోంది.

అదే వూళ్ళోనే తమ్ముడు గోపాలరావు వున్నా అతని భార్య పెత్తనం వల్ల ఆ ఇంటికి వెళితే సూటిపోటి మాటలతో పాడిచేది తమ్ముడి భార్య. భర్త పోయిన క్షణంలో ఆ ఇల్లు చేరితే అప్పుడు అన్న మాటలు ఇంకా చెవులలో మారుమోగుతున్నాయి అన్నపూర్ణమ్మకి – "ఇక్కడేమీ తేరగా వుండటానికి అవకాశం లేదు. వయసులో వున్నావు పని, పాట చేసుకుని జీవితాన్ని నెగ్గుకురావాలి" ఓదార్చడం పోయి సూటిపోటి మాటలతో పాడిచింది. అన్నపూర్ణమ్మ ఆత్మాభిమానం కలదై ఆ ఇంట్లో వుండక బైటకు వచ్చి కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. తమ్ముడికి ప్రేమ, అనురాగం వున్నా భార్య భయం వల్ల ఏమీ చేయలేకపోయేవాడు. అయినా అప్పుడప్పుడు వచ్చి చూసి వెళుతుండేవాడు.

పెద్దకొడుకు డిగ్రీ పూర్తిచేసి ఒక ప్రైవేటు కంపెనీలో గుమాస్తాగా చేరి అన్నపూర్ణమ్మకు అండగా నిలిచాడు. "నీవుఇక ఈ వృత్తి వదిలేయమ్మ. నీకు ఇప్పుడు విశ్రాంతి కావాలి" అనేవాడు. చిన్నకొడుకు కూడా అన్నకు వంత పాడాడు. కూతురు మాలతి ఇంటర్ పాసై ఇంటిపట్టునే వుంటోంది. "ఇక మాలతికి పెళ్ళి చేస్తే నా బాధ్యత తీరిపోతుంది" అనేది పెద్ద కొడుకుతో అన్నపూర్ణమ్మ.

అప్పటికే రెండు, మూడు సంబంధాలు చూశారు.

"నాకేమి ఈ పెళ్ళి సంబంధాలు ఇష్టం లేదు" అంది మాలతి.

"ఎందుకు ఇష్టం లేదు. మనకా ఆస్తిపాస్తులు లేవు. అయినా ఆ బ్యాంకులో పనిచేసే కుర్రాడు నిన్ను ఒప్పుకున్నాడు. ఆ సంబంధమే ఖాయం చేస్తానన్నాడు పెద్దకొడుకు.

"నాకు ఇష్టంలేదన్నయ్యా" అంది మాలతి.

"ఎందుకు ఇష్టం లేదే. లక్షణమైన సంబంధం వెతుక్కుంటూ వచ్చింది. కాదంటావేం?" తల్లి కోపంతో అడిగింది. ఈ సంభాషణ కొనసాగుతుండగా వచ్చాడు గోపాలరావు.

"నేను మావయ్య కొడుకు రవిని ప్రేమించాను" అంది.

"మాలతీ!" గట్టిగా అరిచాడు అన్నయ్య. అన్నపూర్ణమ్మ తీవ్రంగా చూసింది మాలతి వైపు. అయోమయంగా అందరి వంకా చూస్తున్నాడు చిన్నకొడుకు. "మనమంటే మీ అత్తయ్యకు అయిష్టమే. మన నీడ కూడా ఆ ఇంటిమీద పడనీయదు" అంది మాలతివైపు చూసి.

"ముందు నేను చెప్పింది వినండి" అంది మాలతి. "నేనూ, రవి ఎంతో కాలంగా ప్రేమించుకున్నాం. రవికి కూడా మనమంటే అభిమానమే. 'మనకు ఎన్ని అవాంతరాలు వున్నా నిన్నే చేసుకుంటాను' అని నాతో చెప్పేవాడు. రవి ఏమీ పరాయివాడు కాదు. సొంత మేనమామ కొడుకే. పైగా బావ. అత్తయ్యకు కూడా నేనంటే ఇష్టమే. ఇప్పుడు నేను అత్తయ్యతో మాట్లాడి వస్తున్నాను తెలుసా!" అని ఆమె అనగానే అందరూ ఆశ్చర్యపోయారు.

అప్పుడు చెప్పాడు గోపాలరావు "అవును చెల్లాయ్. మీ అందరికి తెలియని విషయం ఒకటుంది. ఈ మధ్యనే కారు ప్రమాదంలో కాంతంకు తీవ్ర గాయాలై విపరీతంగా రక్తం పోయింది. సమయానికి మాలతి వచ్చి రక్తం ఇచ్చి వాళ్ళత్తయ్యను కాపాడింది. 'నాకు రక్తం ఇచ్చి ప్రాణాలు కాపాడిన అమ్మాయి ఎవరండీ?' అంటే నా చెల్లెలి కూతురన్నాను. అగ్గి మీద గుగ్గిలం అవుతుందనుకున్నాను. కోపంతో ఊగిపోతుందనుకున్నాను. కాంతంలో మానవత్వం వుంది. ఆమె మాలతిని దగ్గరకు చేర్చుకుని 'మీ కుటుంబానికి మీ చిన్నతనంలో చాలా అన్యాయం చేశాను. నన్ను క్షమించు. మీ కుటుంబానికి నేను ఏ సహాయం చేయకపోయినా నీవు నా ప్రాణాలు కాపాడి నాకు సహాయం చేశావు. నువ్వు నా కోడలివి' అని అక్కున చేర్చుకుంది. ఇదమ్మా విషయం" అని వివరించాడు గోపాలరావు. అందరూ మాలతి వైపు ఆశ్చర్యానందాలతో చూశారు. "చెల్లాయ్! నీ కూతురు నాకు కోడలే కాకుండా పుట్టింటికి గౌరవం కూడా తెచ్చింది" అన్నాడు గోపాలరావు ఆనందంతో.

– శ్రీమతి రాధారాణి,
కర్నూలు